# నీళ్ళబాధలు

జొన్నలగడ్డ లలితాదేవి

"సిరిగల వానికి చెల్లును తరుణుల పదియారువేల తగ పెండ్లాడన్
తిరిపెమునకిద్దరాండ్రా పరమేశా. గంగ విడువు పార్వతి చాలున్",

అని నిర్మొహమాటంగా చెప్పాడు శ్రీనాథుడు. బాగా ధనం వున్నవాడికి ఎంతమంది భార్యలున్నా పోషించగలడు కనుక ఇబ్బంది లేదు. బిక్షం ఎత్తుకొని తిరిగే జంగం దేవరకి ఇద్దరు పెళ్ళాలెందుకు?

చిన్నప్పుడు ఈ పద్యం చదువుకుంటూ శ్రీనాథుడలా విసుక్కోగానే శివుడు గంగనెందుకు వదిలాడు? నిజంగానే వదిలాడా? అని అనుకునేదాన్ని. అలాగే అడిదం సూరకవి తన పొలంలో నీళ్ళు నిండిపోతే ఆ నడుములోతు నీళ్ళల్లో నిలబడి గంగాదేవినిచూసి "శివజటాజూటాగ్రసీమ నిలిచి తనరు నీవంటి ధన్యకు తమముకాదు.... కదలుమిటమాని దివిజ గంగాభవాని" అని గట్టిగా అరిచేసరికి ఆ నీరంతా వెళ్ళిపోయిందట.

ఇవన్నీ మహాకవుల ప్రతిభా సంపత్తికి ప్రతీకలు. చదువుకొని ఆనందిస్తాము. కాని ఈనాడు ఇంచుమించుగా ప్రతి ఇంటికీ నీళ్ళసమస్య కూడా ఒకటి జోడవుతోంది. ముఖ్యంగా మా ఏరియాలో "శ్రీరామచంద్రా, నారాయణా," ఇలాంటి ఏరియాలు బోలెడు విజయవాడలో.

'ఏదేశమేగినా ఎందు కాలిడినా' అన్నట్లు ఏవూరు వెళ్ళినా, ఏ ప్రాంతం వెళ్ళినా ఎవరూ "కులాసాగా వున్నారా?" అని పలకరించడం మానేసి "మీ పంపులో నీళ్లు వస్తున్నాయా" అని అడగడం మొదలు పెడుతున్నారు.

ఇది లాభం లేదనుకుని కాసేపు శ్రీనాథుడిని తలచుకున్నాను. ఆనాడు వాళ్ళు కవిత్వం రాశారు. పద్యాలు వాళ్ళు రాస్తే గేయాలు మనం రాస్తున్నాం. వాళ్ళు



ప్రబంధాలు రాస్తే మనం నవలలు రాస్తున్నాం. కొత్త అక్షరాలేగదా తేడా అంచేత మనకి వాళ్ళకున్న పవర్సులో కొన్నిఅయినా వుండకపోతాయా అని పాతాళగంగ వగిలి పైకి రాకపోతే పోడాబోయె కనీసం పంపులోనించి అయినా నీళ్ళు పైకి తెప్పించాలని పంపుకింద బకెట్ పడేసి పంపుతిప్పి పద్యం సన్నబడి గేయం అయింది కనుక ఆ గేయం ఒకటి గంగాదేవి మీద చెప్పేద్దాం అనుకునేలోగా వచ్చిపడింది మా ఫ్రెండు.

"ఏం చేస్తున్నావోయ్" అంది.

"నీళ్ళకోసం ఎదురు చూస్తున్నాను. గంగాదేవి కటాక్షించి రెండురోజులయింది మరి" అన్నాను నవ్వుతూ.

"అందుకని గంగాష్టకం చదువుతున్నావా?" అని అడిగింది.

"అబ్బే! నేనే సొంతంగా ఓ గేయం ఆలపిద్దామని."

"అవేం కుదరవోయ్! లలితంటే పార్వతీదేవేగా! అంచేత నీ దగ్గరకి గంగాదేవి ఎలా వస్తుంది చెప్పు? నిన్ను చూసి నీ మెతకతనంచూసి నువ్వు బతిమాల్తున్న కొద్దీ మరింత బిగదీసుకుంటుంది. ఆవిడతో నీకేమిటిగాని మీ అర్థభాగాన్ని పట్టుకో." అంటూ చమత్కరించింది. 'ఏడిసినట్టుంది ఇంటికి వచ్చేసరికి బకెట్ నిండా స్నానానికి నీళ్ళు కనిపించకపోతే మా వారు శివతాండవం గోపీకృష్ణకంటే గ్రాండ్‌గా చేస్తారు. అంచేత రోడ్లంబడి తిరిగయినా నీళ్ళు సేకరించక తప్పదు పంపులో నీళ్ళు రాలేదు బాబోయ్ అని గుండెలు బాదుకొన్నా ఆయనకి వినిపించదు," అన్నాను దిగులుగా పంపుకేసి చూస్తూ.


"అయితే నీ ఖర్మం ఏం చేస్తాం" అంది నవ్వుతూ.

"ఆ సంగతి నువ్వు వేరే చెప్పక్కర్లేదులే" అంటూ నవ్వి వూరుకున్నాను. అసలు వేసవికాలం వస్తుందంటే నే భయంతో గుండెలు దడదడమంటాయి. నీళ్ళకి డిమాండ్ పెరిగిపోతుంది. వాటర్ సప్లయ్ తగ్గిపోతూ వుంటుంది. భూమిలోంచి బోరింగ్ పంపులు పెట్టుకున్నవారు, నుయ్యి వున్నవాళ్ళూ సుఖపడాల్సిందే తప్ప మిగిలిన వాళ్ళంతా నీళ్ళకి యిబ్బంది పడవలసిందే.

గొంతు తడారిపోతుంటే త్రాగిన కొద్దీ మంచినీళ్ళు త్రాగాలనిపిస్తుందేగాని అన్నం తినాలనిపించదు. స్నానం రెండుపూటలా చేసినా మూడోసారి కూడా చేయాలనిపించేంత ఎండవేడి. నీళ్ళ అవసరం ఎక్కువ కనుక అసలు బొత్తిగా రావు. కరుణించని గంగాదేవితో ప్రజలు పడే బాధలు పరమాత్ముడికే ఎరుక.

నీళ్ళు సరిగ్గా రాకపోతే మేడ పైవాటాల వాళ్ళకి టాంకులుంటే ఒక విధంగా నయమేననిపించినా వేసవి కాలంలో కరెంట్ కూడా కట్ అయితే ఎందుకులెండి ఆ బాధ అనుభవించేవాళ్ళకే తెలుస్తుంది.

ఇంటికి బిందెల లెక్కన వంతులు. టైం



ప్రకారం ఒక అరగంట వస్తే, అందులో అయిదారు వాటాలవాళ్ళు పట్టాలంటే యింటికి ఎన్ని వస్తాయి? ఇంక చిన్నపిల్లలుంటే యిహ వేరే చెప్పక్కర్లేదు.

"నీళ్ళు పారపోయకండిరా" అంటూ వాళ్ళ వెనకాల అరుస్తూనే వుండాలి. మా యింట్లో స్కూళ్ళకి సెలవ లిచ్చారంటే ఈ బాధల్ని తలచుకుని మరింత హడలి పోతుంటాను.

నీళ్ళు రావడంలేదు కనుక నీళ్ళు యెంత జాగ్రత్తగా వాడాలో అరగంట బోధించాను. "అలాగేలే." అంటూ తల వూపి బయటకి పరిగెత్తారు మావాళ్లు. మళ్ళీ లోపలికి వచ్చి యధాప్రకారం నీళ్ళతో ఆడుతుంటే నా లెక్చెర్లవల్ల వీళ్ళకి అర్థం అయిందేమీలేదని గ్రహించి "గ్లాసునీళ్ళు పారబోస్తే పది పైసలు ఫైను. అరగ్లాసు పారపోస్తే అయిదు పైసలు" అని జరిమానా విధించాను.

అయిదేళ్ళ పిల్లలకి. నాలుగేళ్ళవాళ్ళకి నీళ్ళని గురించి ఎంత మొత్తుకున్నా అర్థం కాదు గనుక మామూలుగా తాగడానికి ఓ గ్లాసు ముంచి సగం పారపోస్తుంటే లెక్కవేసి సాయంత్రానికి ఎవరెంత ఇవ్వాలో చెప్పాను.


పాపం వాళ్లు గుర్తుపెట్టుకుని వాళ్ళనాన్నగారు రాగానే అడిగి నా జరిమానా చెల్లించారు. కాని ఆ మర్నాడు పొద్దునే 'ఇదిగో లలితా! పిల్లలు నిన్న నా దగ్గర చిల్లరంతా లాగేశారు. నీ దగ్గర చిల్లరుంటే యియ్యి.' అని డబల్ చిల్లర ఆయన నా దగ్గర వసూలుచేసే యిదేంలాభం లేదని స్కేలుతో వేస్తానని భయపెట్టాను పిల్లల్ని. మూడేళ్ళ మా శాంతి నీళ్ళు పారపోయనే పోసింది. స్కేలుతో వేయాలంటే ఓ బాధ. వేయకపోతే "అబ్బే. అమ్మయింతే. కొట్టదులే" అన్న ధైర్యంవచ్చి భయం తగ్గిపోతుందేమోనని మరో బాధ. ఓ దెబ్బవేస్తే మళ్ళీ అరగంట సముదాయించుకోవలసిందీనేనే.

ఇలాంటి సంకటస్థితి యెదుర్కొనే గృహిణులు లక్షలమంది వున్నారు.

కృష్ణానది వున్న విజయవాడకి నీళ్ళకోసం ఇబ్బందిపడవలసిన పనేమీలేదని ఒకసారి డాక్టర్ కె. యల్. రావు అన్నారు.

పనిమనిషి లక్ష్మి. "అమ్మా: మద్రాసు వాళ్ళంతా నీళ్ళు లేక రాత్రికి రాత్రి మన కృష్ణలో నీళ్ళన్నీ బిందెలతో పట్టుకుని లారీల కెత్తుకుని వెళ్ళిపోతున్నా రంటగా. అందుకే గొట్టాల్లోంచి నీళ్ళు రావడం లేదంట." అని అంది.

"నీకెవరు చెప్పారు?" అన్నాను నవ్వి.




"అల్లా ఆ ఎదురింటి అయ్యగారు" అంది చూపిస్తూ.

"ఎవరేది చెబితే అదే నమ్మకు" అని మరేదో అనబోయాను.

ఇంతలోకి శ్రీవారు రానే వచ్చారు. వస్తూనే దొడ్లోకి వెళ్ళి "తొట్టి ఖాళీ, బిందెలు ఖాళీ, బకెట్లు ఖాళీ, నేను స్నానం యెలాగ చేసేది?" అంటూ గయ్యిమంటున్నారు.

అవును నిజమే. మరి కాసేపటిలో మంచినీళ్ళ బిందెకూడా ఖాళీ అవుతుంది. ఆ విషయం చెబితే శ్రీవారు అక్కడ చేసే తాండవానికి బిందెలు దొర్లిపోతాయి. బకెట్లు యెగిరిపోతాయి. ఆఖరికి తొట్టి కూడాపగిలి వూరుకుంటుంది.

ఇన్ని అనర్థాలు జరుగుతున్నా నిశ్చలంగా నిలబడిన నీళ్ళ పంపునిచూసి నిట్టూరుస్తూ గంటనించీ అణచుకుంటున్న దాహం ఇక అరికట్టలేక ఓ గ్రుక్కెడు నీళ్ళు తాగాలని లోపలికి వెళ్ళిపోయాను. ఇంతలో ఫైరింజన్ గణగణ మంటూ పోతోంది. వేసవిలో నీళ్ళు రావుగనుక అగ్నిహోత్రుడికి ఆకలి ఎక్కువ. మరి ఏంచేస్తాం?

పెండ్లి అనేది మనంపెట్టుకున్న ఆచారం, మాతృత్వం అనేదిసృష్టి స్త్రీకి యిచ్చిన మహావరం, భర్త ఎంతటి అనురాగమూర్తి అయినా తనభావాలను సమర్థించలేని భర్తతో ప్రణయకలహానికి దిగిన ఓ అందాలభామకథ

యద్దనపూడి సులోచనారాణి

అపూర్వ సృష్టి

సహజీవనం

వెలువడింది! వెల: రు. 14/-

అన్ని షాపులలోను దొరుకుతవి. లేదా

14 రూ॥లు M.O. చేయండి;

క్వాలిటీ పబ్లిషర్స్

విజయవాడ-2